సాక్షి
ఒడిశా

శనివారం । 1 । ఏప్రిల్ । 2023




శ్రీమందిరం ఆదాయం లెక్కింపు
భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని, ఆలయ పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,47,545లు, బంగారం 3.2 గ్రాములు, వెండి 33గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



తొలి స్వేచ్ఛా వాయువు.. ఉత్కళం

- 8లో



చైత్రోత్సవాలకు శ్రీకారం
- రాయగడలో ప్రారంభమైన మజ్జిగౌరి వార్షికోత్సవాలు

- 8లో

న్యూస్‌రీల్

గుర్రపు స్వారీలో రిషితా సత్తా



సాధించిన పతకంతో గుర్రంపై రిషితా

భువనేశ్వర్: గుర్రపు స్వారీ పోటీల్లో రాష్ట్రానికి చెందిన బాలిక వరుస విజయాలు సాధించడం విశేషం. దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న పోటీల్లో రిషితా సామంతరాయ్ 2 పతకాలు సాధించింది. శుక్రవారం తలపడిన పోరులో మహిళల విభాగంలో రజతం, అంతకుముందు ఓపెన్ హ్యాక్స్‌లో కాంస్య పతకం దక్కించుకుంది. 12 ఏళ్ల రిషిత.. గుర్రం వోల్టెయిర్‌తో జాతీయ స్థాయిలో ఈ రెండు పతకాలను కైవసం చేసుకుంది.

కోత పూర్తి.. తరలింపే తరువాయి



ఘుముసర అడవిలో చెట్టుకు పూజలు చేస్తున్న మహిళలు

బరంపురం: ఏటా తరహాలో పూరీ శ్రీక్షేత్రంలో జరిగే రథయాత్ర కోసం నూతన రథాల నిర్మాణానికి అనుగుణంగా గంజాం జిల్లా బంజీనగర్ సబ్ డివిజన్‌లోని ఘుముసుర అటవీ ప్రాంతంలో కలప కోత ప్రారంభమైంది. జూన్ 20న జరగనున్న రథయాత్రకు సంబంధించి తరాసింగ్ పంచాయతీ ఘుముసుర అడవిలో భారీ వృక్షాలను గుర్తించారు. డీఎఫ్‌ఓ సహకారంతో శుక్రవారం ఉదయం మహిళలు సంప్రదాయ ముగ్గులు వేసి, ప్రత్యేక పూజలు చేసిన అనంతరం 9 సగువాని, 10 సలువా చెట్లను కట్ చేశారు. వీటిని పూరీకి తరలించేందుకు ఏర్పాట్లు చేశామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు



ఢెంకనాల్ మున్సిపాలిటీ 13వ వార్డులో నిలిచిన వరదనీరు

భువనేశ్వర్: రాజధాని నగరం భువనేశ్వర్‌తో సహా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల్లో నీట మునిగడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పట్టణ, నగర ప్రాంతాల్లో జనజీవనం వరదనీటిలో ఎదురీదాల్సి వచ్చింది. వాహనాల రాకపోకలకు కూడా అంతరాయం ఏర్పడింది. నయాఘడ్, ఖుర్దా, భువనేశ్వర్, కటక్, ఢెంకనాల్, జగత్‌సింగ్‌పూర్, కేంద్రాపడా, భద్రక్, జాజ్‌పూర్ జిల్లాల్లో 60 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో వీచిన ఈదురు గాలులతో వివిధ ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి.

రౌర్కెలా ఎమ్మెల్యేకు త్రుటిలో తప్పిన అపాయం



ఘటనా స్థలంలో ఎమ్మెల్యే శారదాప్రసాద్ నాయక్

భువనేశ్వర్: రౌర్కెలా ఎమ్మెల్యే శారదాప్రసాద్ దాస్ నాయక్ ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురవ్వగా, త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. శుక్రవారం ఉదయం కారులో భువనేశ్వర్ వెళ్తుండగా ఢెంకనాల్ జిల్లా 53వ నంబర్ జాతీయ రహదారి బంవుషాపాల్ కూడలి ఈ ప్రమాదం సంభవించింది. కారు హైడ్రా యంత్రాన్ని ఢీకొట్టింది. ఆ సమయంలో ఎమ్మెల్యేతో పాటు మరో నలుగురు ప్రయాణిస్తున్నారు. సమాచారం అందుకున్న కామాక్షనగర్ ఠాణా పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించారు. వేరే కారులో ఎమ్మెల్యేను భువనేశ్వర్ సురక్షితంగా చేర్చారు.

శంఖారావం మోగించాలని..

- నవకిషోర్ దాస్ కుమార్తెను ఎంపిక చేసిన బీజేడీ అధిష్టానం
- ముందునుంచీ జనాన్ని ఆకట్టుకునే ప్రయత్నంలో దీపాలి దాస్
- ఝార్సుగుడ ఉప ఎన్నికలో సానుభూతే అస్త్రంగా వ్యూహాలు



బీజేడీ అభ్యర్థి దీపాలి దాస్



భువనేశ్వర్: ఝార్సుగుడ అసెంబ్లీ స్థానానికి మే 10న జరగనున్న ఉప ఎన్నికకు సంబంధించి అధికార పార్టీ బిజూ జనతాదళ్(బీజేడీ) అభ్యర్థిగా దీపాలి దాస్(26)ను ప్రకటించారు. మేనేజ్‌మెంట్‌లో పట్టభద్రురాలైన ఆమె.. దివంగత మంత్రి నవకిషోర్ దాస్ కుమార్తె. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నుంచి ఆమోదం లభించింది. దీనిపై బీజేడీ కార్యాలయం శుక్రవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది జనవరి 29న మంత్రి నవకిషోర్ దాస్ హత్యకు గురైన విషయం తెలిసిందే. తండ్రి మరణించినప్పటి నుండి దీపాలి దాస్ పేరు మార్మోగుతోంది. ఝార్సుగుడ అసెంబ్లీలో విస్తృత పర్యటనలతో సభలు, సమావేశాలు తదితర కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. స్వల్ప వ్యవధిలో నియోజకవర్గ వ్యాప్తంగా బలమైన ప్రజా సంబంధాలను మెరుగు పరచుకున్నారు. ఉప ఎన్నికల షెడ్యూల్‌ను బుధవారం భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) ప్రకటించిన రెండు రోజులకే దీపాలి అభ్యర్థిత్వాన్ని ముఖ్యమంత్రి ప్రకటించి, ఆసక్తి పెంచారు. ఇకప్రధాన ప్రతిపక్షాలు బీజేపీ, కాంగ్రెస్ తమ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది.

తేల్చని కాంగ్రెస్, బీజేపీ..

బీజేపీ తరఫున యువనేత టొంకొధొరొ త్రిపాఠి పేరును ప్రతిపాదించే అవకాశం ఉండగా.. కాంగ్రెస్ తగిన అభ్యర్థి ఎంపిక కోసం గాలిస్తోంది. ఈ నేపథ్యంలో ఐదుగురు సభ్యులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసింది. సీనియర్ నాయకుడు, కంటాబంజి ఎమ్మెల్యే సంతోష్‌సింగ్ సలూజా అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేసినట్లు ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(ఓపీసీసీ) అధ్యక్షుడు శరత్ పట్నాయక్ తెలిపారు.

24 వరకు ఆగాల్సిందే..

బుల్లెట్ గాయాలతో భువనేశ్వర్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంత్రి తుదిశ్వాస విడిచిన మరుక్షణం నుంచి దీపాలీ దాస్ ప్రత్యక్షంగా రంగంలోకి దిగి సానుభూతి పవనాలను అనుకూలంగా మలచుకోవడంలో తలమునకలయ్యారు. అలాగే కరోనా సమయంలో, తండ్రి కిషోర్‌దాస్ ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్నప్పుడు కోవిడ్-19పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించారు. వైరస్ వ్యాప్తిపై చైతన్యవంతం చేయడంలో తనదైన పాత్ర పోషించారు. అలాగే సానుభూతితో మహిళల ఆదరణ చూరగొని ఉప ఎన్నికలో విజయ శంఖారావం చేయడం తథ్యమనే సంకేతాలను జారీ చేసి, బీజేడీ అధిష్టానం దృష్టిని ఆకట్టుకున్నారు. మరోవైపు ఝార్సుగుడ ఉప ఎన్నిక నామినేషన్ల దాఖలు ఏప్రిల్ 20 వరకు కొనసాగుతాయి. మరుసటి రోజు నామినేషన్ దస్తావేజులు పరిశీలించి, అర్హులైన అభ్యర్థుల జాబితాని విడుదల చేస్తారు. పోటీ విరమణకు ఏప్రిల్ 24 వరకు గడువు కల్పించారు. దీంతో బరిలో తలపడే అభ్యర్థుల ముఖచిత్రం స్పష్టం అవుతుంది.



తండ్రి నవకిషోర్ దాస్‌తో దీపాలి(ఫైల్)

హ్యాట్రిక్ విజేతగా దాస్..

దివంగత నవకిషోర్ దాస్ గత మూడు అసెంబ్లీ ఎన్నికల్లో ఝార్సుగుడ నియోజకవర్గం నుంచి వరుస విజయాలు సాధించారు. 2009, 2014లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఎన్నికైన ఆయన.. 2019 ఎన్నికల ముందు అధికార పార్టీ బీజేడీలో చేరారు. అనంతరం అదే టిక్కెట్టుపై హ్యాట్రిక్ విజయం అందుకున్నారు. అంతకుముందు కిషోర్‌కుమార్ మహంతి బీజేడీ అభ్యర్థిగా 2000, 2004 సంవత్సరాల్లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఝార్సుగుడ నుంచి ఎన్నికయ్యారు.

పోషిస్తూ.. స్ఫూర్తిగా నిలుస్తూ..

- ఆటో నడుపుతూ భువనేశ్వర్ నుంచి రాయగడ చేరుకున్న యువతి
- స్వయం ఉపాధిపై మహిళా చైతన్యమే లక్ష్యంగా పర్యటన



ఆటో నడుపుతున్న సంతోషి దేవ్

రాయగడ: ఇంటి కష్టాలు ఆమె బతుకు బాట నేర్పించాయి. తల్లి అనారోగ్యంతో మంచం పట్టింది. తండ్రి కూలిపని చేసుకుంటూ సంపాదించిన కాయకష్టంతో అతికష్టంపై ఇళ్లు గడిచేది. దీంతో ఏడో తరగతిలోనే చదువుకు స్వస్తి పలికి తండ్రికి చేదోడుగా కూలి పనికి వెళ్లేది. అయితే కొద్ది రోజులకే ఆయన కూడా కదల్లేని స్థితికి చేరడంతో ఇంటి భారమంతా తనపై వేసుకుంది. చిన్న వయస్సులోనే చుట్టుపక్కల వారి సాయంతో ఆటో నడపడం నేర్చుకొని, తన సంపాదనతో కుటుంబాన్ని పోషించడంతో పాటు పలువురికి ఆదర్శంగా నిలిస్తోంది.. భువనేశ్వర్‌కు చెందిన సంతోషి దేవ్ సుమారు 800కిలోమీటర్లు ఆటో నడుపుతూ శుక్రవారం రాయగడ చేరుకున్న ఆమెకు స్థానిక మజ్జిగౌరి ఆటో డ్రైవర్ల సంఘం ప్రతినిధులు పుష్పగుచ్ఛం అందించి, స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మీడియా ప్రతినిధులతో మాట్లాడారు.

సామాజిక స్ఫూర్తితో..

ఆర్థిక పరిస్థితులు చిన్నాభిన్నం కావడంతో 2015లో ఆటో నడపడం నేర్చుకున్నానని సంతోషి దేవ్ తెలిపారు. ఈ క్రమంలో రాష్ట్ర రాజధాని నగరం భువనేశ్వర్‌లో ఆటో నడపడంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని, ఈ రంగాన్ని ఎంచుకున్నానన్నారు. రాష్ట్రంలో ఎంతోమంది బతుకు జీవుడా అంటూ పొట్ట చేతపట్టుకుని ఇతర రాష్ట్రాలకు ఉపాధి కోసం వెళ్తున్నారని, అటువంటి వారిని చైతన్య పరచాలనే ఉద్దేశంతో సమయం ఉన్నప్పుడు ఊరూరా తిరుగుతూ అక్కడి ఆటో డ్రైవర్ల సాయంతో యువతుల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. కొరాపుట్, జయపురం, ఫుల్బాణి జిల్లాలో గత వారం రోజులుగా ఆటోలో పర్యటించి, రాయగడ చేరుకున్నట్లు వివరించారు. తాను పర్యటించిన ప్రతి ప్రాంతంలోని మహిళలతో సమావేశమై, స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలియజేశారు. ప్రస్తుత రోజుల్లో మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని, అవిభక్త కొరాపుట్ జిల్లాల్లో సైతం ఈ స్ఫూర్తిని తీసుకోవాలని ఆకాంక్షించారు. కష్టపడి పనిచేస్తే ఏ పనిలో అయినా తప్పకుండా రాణిస్తామని, దీనికి అనుగుణంగా ప్రభుత్వం కూడా సహాయ, సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు సింహాద్రి పాణిగ్రాహి, కార్యదర్శి రాజేంద్ర బెహరా పాల్గొన్నారు.



రాయగడలో సంతోషికి స్వాగతం పలుకుతున్న డ్రైవర్ల సంఘం ప్రతినిధులు

కనీస వేతనం అమలుకు డిమాండ్



ర్యాలీ నిర్వహిస్తున్న ఎండీఎం కార్మికులు

జయపురం: గత రెండు దశాబ్దాలుగా మధ్యాహ్న భోజన పథకం వంట సహాయకులుగా పని చేస్తున్నా తమకు కనీస వేతనం చెల్లించడం లేదని ఎండీఎం కార్మికులు వాపోయారు. ఈ మేరకు జయపురం సమితి బొరిగుమ్మలో శుక్రవారం భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి యుధిష్టర్ రౌళొ నేతృత్వంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, సీఎం నవీన్ పట్నాయక్‌ను ఉద్దేశించిన వినతిపత్రాలను సమితి విద్యాశాఖ అధికారి సచిన్ మల్లిక్‌కు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఎండీఎం సహాయకులకు కనీస వేతనం రూ.26,000లు అందజేయాలని, సామాజిక భద్రత కల్పించడం, ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించడం, బకాయి ఉన్న 26నెలల వేతనాన్ని వెంటనే చెల్లించాలని, ప్రసూతి సెలవులు, ఉద్యోగ విరమణ అనంతరం పింఛన్ సౌకర్యం కల్పించాలని తదితర డిమాండ్లు చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఉత్తమ మల్లిక్, జమున భూమియ, దిలీప్ మల్లిక్, దినేష్ రోణ, ధనమతి పూజారి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి నిధుల మంజూరు

రాయగడ: పట్టణంలోని భైరవీధిలో గ్రామ దేవతగా పూజలందుకుంటున్న బురదల పోలమ్మ ఆలయ ప్రాంగణంలో ప్రజల సౌకర్యార్థం రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి తమ నిధుల నుంచి రూ.30 లక్షల నిధులు కేటాయించారు. ఇందులో భాగంగా మొదటి విడతగా రూ.10 లక్షలను మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో ఆలయ యువజన కమిటీ ఆయనకు కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ మేరకు మందిరం ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముదులి మద్దతుదారులు హాజరయ్యారు. అనంతరం కొండబాబు, కింతలి రాజు, ఎద్దు మధుసూదనరావు, పట్నాన గౌరీశంకరరావు, కాసినాయుడు లను కమిటీ ప్రతినిధులు పతివాడ శ్రీనివాసనాయుడు తదితరులు అభినందించారు.

వీకే పాండ్యన్ పర్యటనపై ప్రశ్నలు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మల్కన్‌గిరి: స్థానిక ఎమ్మెల్యే ఆదిత్యమాఢి నివాసంలో బీజేపీ నాయకులు విలేకర్ల సమావేశం శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్కన్‌గిరి జిల్లాలో సోమ, మంగళవారాల్లో రాష్ట్ర 5టీ కార్యదర్శి వీకే పాండ్యన్ పర్యటించారని గుర్తుచేశారు. అయితే ఇది ప్రభుత్వ అధికారిక పర్యటన లేదా వ్యక్తిగతంగా సందర్శించారా అని మాజీ ఎంపీ బలభద్ర మాఝి ప్రశ్నించారు. ప్రభుత్వ పనుల తనిఖీల సమయంలో స్థానిక ఎమ్మెల్యేకు సమాచారం అందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. అలాగే బీజేడీకి చెందిన జాజ్‌పూర్ ఎమ్మెల్యే ప్రణబ్ ప్రకాష్‌దాస్ ఇందులో పాల్గొవడంపై విస్మయం వ్యక్తంచేశారు. కార్యదర్శి హోదాలో ప్రభుత్వ ఖర్చులతో ప్రత్యేక హెలీకాప్టర్‌లో పర్యటించేందుకు ఎవరు అనుమతిచ్చారని నిలదీశారు. 2016లో రైల్వేలైన్ ఏర్పాటుకు హామీ ఇచ్చారని, ఏడేళ్లు గడిచినా పనులు ముందుకు సాగలేదని విమర్శించారు. సమావేశంలో ఎమ్మెల్యే ఆదిత్య మాఢి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిమాయి పాల్, జిల్లా కార్యదర్శి మానిక్‌లాల్ పాల్గొన్నారు.

అవకాశాలు వినియోగించుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జాస్మిన్ సింగ్, అధికారులు

- ఏడీఎం సంగ్రాంశేఖర పండా
- ఘనంగా అంతర్జాతీయ ట్రాన్స్‌జెండర్స్ విజిబిలిటీ దినోత్సవం



హిజ్రాలకు ఓటరు ఐడీ, ధ్రుపత్రం అందిస్తున్న ఏడీఎం సంగ్రాంశేఖర పండా

పర్లాకిమిడి: సంఘంలో హిజ్రా(కిన్నెరు)లకు సమాన హక్కులను రాజ్యాంగం కల్పించిందని, అలాగే రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న వివిధ స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు మేజిస్ట్రేటు సంగ్రాంశేఖర పండా పిలుపునిచ్చారు. అంతర్జాతీయ ట్రాన్స్‌జెండర్స్ దృశ్యమాన్యత దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా కేంద్రంలో విజిబిలిటీ కార్యక్రమాన్ని శుక్రవారం జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. సబ్ కలెక్టర్ అలోక్‌కుమార్ ప్రధాన్ మాట్లాడుతూ గజపతి జిల్లాలో మొత్తం 62మంది హిజ్రాలకు స్వయం ఉపాధి కింద రూ.2.50 లక్షలు మంజూరు చేశామని తెలిపారు. వీరిలో దరఖాస్తు చేసుకున్న 20మందికి ఓటరు గుర్తింపుకార్డులు అందజేశామన్నారు. అలాగే టెర్రాకోట హస్తకళల ద్వారా 10మందికి 60 రోజులు శిక్షణ అందించడంతో పాటు స్వయం ఉపాధికి మార్గం కల్పించామని డీఎస్‌ఎస్‌ఓ సంతోష్‌కుమార్ నాయక్ పేర్కొన్నారు. జిల్లా సఖి ఒన్ స్టాప్ సెంటర్, ట్రాన్స్‌జెండర్స్ సంఘం కార్యదర్శి జాస్మిన్‌సింగ్ మాట్లాడుతూ.. పర్లాకిమిడిలో ఉన్న 62మందిలో ఐదుగురికి మాత్రమే బిజూ స్వాస్థ్య ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరయ్యాయని, అందరికీ ఈ అవకాశం కల్పించాలని కోరారు. అలాగే అంత్యోదయ ఉచిత బియ్యం పథకం, వసుంధరా ఇళ్ల పట్టాల పథకం, ప్రతి బస్టాండ్, కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రత్యేక మరుగుదొడ్లు, ఉపాధి పథకాల జాబితా చోటు కల్పించాలని విన్నవించారు. దీనిపై సివిల్ సప్లై అధికారి ప్రఫుల్లకుమార్ బెహరా అంగీకరించారు. కార్యక్రమంలో ఏడీఎం(రెవెన్యూ) బీరేంద్రకుమార్ దాస్, స్వాస్ స్వచ్ఛంద సంస్థ టీవి ఏజెన్సీ పి.సునీత, హిజ్రాలు పాల్గొన్నారు.

బడ్జెట్ సమావేశాలకు తెర

- ప్రభుత్వం పలాయనం: ప్రతిపక్ష నేత జయ నారాయణ మిశ్రా
- అప్రజాస్వామికం: కాంగ్రెస్ ఎమ్మెల్యే నర్సింగ్ మిశ్రా



భువనేశ్వర్: అసెంబ్లీలో బడ్జెట్ సమావేశాలు అర్ధాంతరంగా ముగిశాయి. నిర్ణీత సమయానికి 6 రోజులు, 4 పనిదినాలు ముందే సమావేశాలకు తెర దించేశారు. ఈ మేరకు స్పీకర్ బిక్రమ్‌కేశరి అరూఖ్ సభను నిరవధికంగా వాయిదా వేసినట్లు శుక్రవారం ప్రకటించారు. దీంతో ఏప్రిల్ 6 వరకు జరగాల్సిన సమావేశాలు ముందుగానే ముగిశాయి. మంత్రి నవకిషోర్ దాస్ హత్య, 5టీ ఆధిపత్యం, మహానది జలాల పంపిణీ, రాహుల్‌గాంధీ సభ్యత్వం రద్దు, ఆఫీసర్ రాజ్, నకిలీ సర్టిఫికెట్లు తదితర అంశాలపై వాగ్వివాదంతో బడ్జెట్ సమావేశాలు ఆద్యంతాలు వాడివేడిగా సాగాయి. ఈ సమావేశాలు ఫిబ్రవరి 21న ప్రారంభం కాగా.. 2023-24 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ఫిబ్రవరి 24న సభలో ప్రవేశ పెట్టారు. గత బడ్జెట్ సమావేశాల కంటే ఈసారి రసవత్తరంగా సాగాయి. ప్రధానంగా అసెంబ్లీలో ప్రతిపక్ష నేత జయనారాయణ మిశ్రా, కాంగ్రెస్ నేత నర్సింగ్ మిశ్రా రాష్ట్రంలో తాజా సంచలనాత్మక ఘటనలపై పలు అంశాలను ప్రధాన శీర్షికలుగా మలచి, ప్రభుత్వానికి ఉక్కిరిబిక్కిరి చేశారు. విపక్షాల ఎదురు దాడితో సభ పలుమార్లు వాయిదా పడింది. ఈ వ్యవహారాలు చక్కదిద్దే ప్రయత్నంలో స్పీకర్ 12సార్లు అఖిలపక్ష సమావేశాలను ఏర్పాటు చేశారు. ఈ ప్రయత్నం ఫలప్రదం కాలేదు.

బిల్లులు ఉపసంహరణ..

బడ్జెట్ సమావేశాలు రెండు దశల్లో 23 రోజులు కొనసాగాయి. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ఇందులో ఆమోదించారు. సభలో ప్రవేశపెట్టిన మూడు బిల్లులను రాష్ట్రప్రభుత్వం ఉపసంహరించుకుంది. వీటిలో రాష్ట్ర వెనుకబడిన వర్గాల కమిషన్(సవరణ) బిల్లు-2023, ఒడిశా అపార్టుమెంట్(ఓనర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్) బిల్లు-2023, ఒడిశా భూ సేకరణ(సవరణ) బిల్లు-2023 ఉన్నాయి. వివిధ అంశాలపై సమాధానం చెప్పలేక ప్రభుత్వం పలాయనం చిత్తగించిందని ప్రతిపక్ష నేత బీజేపీ సభ్యుడు జయనారాయణ మిశ్రా ఆరోపించారు. కాంగ్రెస్ కూడా దీనిని ఖండిస్తూ ఇది అప్రజాస్వామికమని పేర్కొంది. మరోవైపు, సభలో అంత ముఖ్యమైన వ్యవహారాలు లేకపోవడంతో ముగిస్తున్నట్లు బిజూజనతా దళ్ తెలిపింది.

అసెంబ్లీలో కాగ్ నివేదిక

భువనేశ్వర్: రాష్ట్రానికి సంబంధించి 2021-22 ఆర్థిక సంవత్సర కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) నివేదికను అసెంబ్లీలో ఆర్థికశాఖ మంత్రి నిరంజన పూజారి శుక్రవారం ప్రవేశపెట్టారు. ఇందులో రాష్ట్ర రుణభారం రూ.72,485 కోట్లుగా నివేదికలో వెల్లడించింది. దీనిలో అంతర్గత రుణం రూ.53,977.24 కోట్లు, భారత ప్రభుత్వం నుంచి అడ్వాన్స్ రూపంలో రూ.18,507.82 కోట్లుగా పేర్కొన్నారు. గనుల శాఖ నుంచి గరిష్టంగా రూ.49,859 కోట్లు ఆర్జించగా, ద్రవ్య సేవాపన్ను(జీఎస్టీ) ద్వారా రూ.27,826 కోట్లు ఆదాయం చేకూరిందన్నారు. రెవెన్యూ వ్యయం రూ.95,311 కోట్ల నుంచి రూ.1,09,586 కోట్లకు పెరిగినట్లు స్పష్టం చేశారు. 2020-21లో రెవెన్యూ మిగులు రూ.9,076 కోట్లు కాగా.. గత ఏడాది కంటే రూ.43,472 కోట్లు పెరగడం గమనార్హం. మార్చి నాటికి మొత్తం రాష్ట్రం అప్పు రూ.1,20,140 కోట్లుగా ఉంది.

క్లుప్తంగా

వికసించిన సహస్రదళ పద్మం



బొడొబి పీహెచ్‌డీ యూనిట్‌లో వికసించిన సహస్రదళ పద్మం

భువనేశ్వర్: కెంజొహర్ జిల్లా బొడొబిలో అరుదైన సహస్రదళ పద్మం వికసించింది. స్థానిక పీహెచ్‌డీ యూనిట్ తోటలో ఈ అరుదైన పద్మం వికసించడం విశేషం. విదేశాల నుంచి దిగుమతయ్యే ఈ పద్మం కంద(పిలక)ను పర్యావరణ ప్రియుడు, సామాజిక కార్యకర్త విజయ్ మహంతి ఏడాది క్రితం కోల్‌కతా నుంచి తీసుకు వచ్చారు. తన తోటలో నీళ్ల డ్రమ్ము ఏర్పాటు చేసి, నీరు, మట్టి కలగలిపి పంకం సిద్ధం చేశారు. ఇందులో నాటిన పిలకలు దాదాపు ఏడాది తర్వాత మొలకెత్తాయి. వారం తర్వాత మొగ్గ తొడిగి రెండు వారాలకు వెయ్యి దళాలతో గులాబీ వర్ణపు పద్మం వికసించిందని ఆయన వివరించారు.

పోలీస్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి



పోలీస్ సిబ్బంది సమస్యలు వింటున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: పోలీసు ఉద్యోగుల సంక్షేమానికి జిల్లా పోలీసు శాఖ కృషి చేస్తుందని ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పోలీస్ వెల్ఫేర్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది సమస్యలను ఆమె విని, పరిష్కారానికి గాను సంబంధిత అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ కారుణ్య నియమాకాల భర్తీ

విజయనగరం టౌన్: ఆర్టీసీలో కారుణ్య నియామకాలకు సంబంధించి పోస్టులు భర్తీచేయనున్నట్లు శ్రీకాకుళం జిల్లా ప్రజారవాణాధికారి ఆకాశపు విజయకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెక్ రీజియన్ పరిధిలో విజయనగరం,శ్రీకాకుళాలకు సంబంధించి ఇప్పటికే కొందరికి ఉద్యోగాలు ఇచ్చామన్నారు. మిగిలిన వాటిలో జూనియర్ అసిస్టెంట్, కండక్టర్, శ్రామిక్ పోస్టులను ప్రస్తుతం వారి అర్హతలను బట్టి భర్తీచేసేందుకు సన్నాహాలు చేపట్టామని చెప్పారు. అర్హులైన అభ్యర్థులు అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

దొంగనోట్ల కేసులో ఆరుగురికి జైలుశిక్ష

బొబ్బిలి: దొంగనోట్ల చలామణీలో ఆరుగురు వ్యక్తులకు జైలుశిక్ష వేస్తూ సబ్ జడ్జి టి.వాసుదేవన్ శుక్రవారం తీర్పు వెలువరించినట్టు ఏపీపీ మజ్జి జగన్నాథం తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరుకు చెందిన బూరాడ సూర్యనారాయణ దొంగనోట్లు కలిగి ఉన్నందుకు, వాటిని చలామణీ చేసినందుకు ఐదేళ్ల చొప్పున జైలుశిక్ష, ఐదు వేల రూపాయల జరిమానా, రెండు కేసుల్లోనూ ఉన్నందుకు మరో రెండేసి వేల జరిమానాను విధించారన్నారు. అలాగే కేవలం దొంగనోట్లు కలిగి ఉన్నందుకు బూరాడ గురమ్మ, బూరాడ చంద్రమ్మ, సీహెచ్ నూకారెడ్డి, కొప్పిశెట్టి శ్రీనివాసరావు, దాసరి సత్యనారాయణలకు ఐదేళ్ల జైలు శిక్ష, రెండు వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారన్నారు. 2010లో నమోదైన ఈ కేసులో ఏడుగురు నిందితులు కాగా వీరిలో కంటు వెంకటమ్మ అనే మహిళ గతంలోనే మృతి చెందినట్టు ఏపీపీ జగన్నాథం తెలిపారు.

ఐటీ యాక్ట్ కేసు నమోదు

విజయనగరం క్రైమ్: గుర్తు తెలియని వ్యక్తులు తన ఖాతా నుంచి నగదును విత్ డ్రా చేసినట్లు కామరాజు అనే వ్యక్తి వన్‌టౌన్‌పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. కామరాజు అకౌంట్ నుంచి ఆయనకు తెలియకుండా ఒకసారి రూ.25వేలు, మరోసారి రూ.20వేలు మొత్తం రూ.45వేలు విత్ డ్రా అయినట్లు మెసెజ్‌లు రావడంతో పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు.

తంపటాపల్లిలో విజిలెన్స్ తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

పాలకొండ రూరల్: మండలంలోని తంపటాపల్లి గ్రామంలో గల అనాథపిల్లల ఆశ్రమాన్ని విజిలెన్స్ ఎస్పీ సురేష్‌బాబు ఆదేశాల మేరకు ఆశాఖ ఎస్సై బి. రామారావుతో పాటు సిబ్బంది శుక్రవారం పరిశీలించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న పిల్లల వివరాలను నిర్వాహకుల ద్వారా అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. పిల్లలకు అందుబాటులో ఉంచిన సౌకర్యాలపై ఆరా తీశారు. తాము సేకరించిన నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని విజిలెన్స్ ఎస్సై తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంతి కుమారి,సిబ్బంది లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

తొలి స్వేచ్ఛా వాయువు..

ఉత్కళం





పర్లాకిమిడిలోని గజపతి ప్యాలెస్ (ఇన్‌సెట్లో) మహారాజా కృష్ణచంద్ర గజపతి నారాయణ దేవ్

- నేడు రాష్ట్ర అవతరణ వేడుకలు
- ప్రత్యేక రాష్ట్రానికి కృషిచేసిన పర్లాకిమిడి మహారాజా కృష్ణచంద్ర గజపతి

పర్లాకిమిడి:

దేశానికి స్వాతంత్ర్యం రాకముందే ప్రత్యేక ఉత్కళ రాష్ట్రాన్ని 1936 ఏప్రిల్ 1న బ్రిటిష్ ప్రభుత్వం మద్రాసు ప్రెసిడెన్సీ నుంచి వేరుచేసి, ప్రకటించింది. అప్పటివరకూ ఆంధ్రప్రదేశ్, బీహార్, మద్రాసు ప్రెసిడెన్సీలో ఈ ప్రాంతం వుండేది. బ్రిటిష్ ప్రభుత్వంతో పర్లాఖెముండి మహారాజా కృష్ణచంద్ర గజపతి నారాయణదేవ్ అనేక దఫాలుగా పోరాడటంతో ప్రత్యేక రాష్ట్రం సాధించుకుంది. 1903లో ఉత్కళ గౌరవ్ మధుసూదన్ దాస్, పర్లాఖెముండి నుంచి భారతీయ జాతీయ కాంగ్రెస్ తరపున శ్యాంసుందర్ రాజగురు, పద్మనారాయణ, పండిత గోపబంధు దాస్, కవి ఉపేంద్ర భోంజో నేతృత్వంలో ఒడియా జాతి విముక్తి కోసం ఉత్కళ హితేషిని ఏర్పాటు చేశారు. అనేకమంది కవులు, మేధావులు, భాషా ప్రేమికులు సంయుక్తంగా పోరాటాలు చేశారు. ఈ మేరకు లండన్‌లో 1930లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి సైతం పర్లాకిమిడి మహారాజా కృష్ణచంద్ర గజపతి హాజరయ్యారు. తన జీవితంలో సగం భాగం, లక్షలాది రూపాయలను ఉత్కళ రాష్ట్రం పోరాటానికే వెచ్చించారు. ఈ నేపథ్యంలో రెండో రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌కు సైతం హాజరైన మహారాజా.. ఎట్టకేలకు బ్రిటిష్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి.. 1936 ఏప్రిల్ 1న ప్రత్యేక ఒడిశా సాధించారు.

నేటి కార్యక్రమాలు..

పర్లాకిమిడి లోని మహారాజా కృష్ణచంద్ర గజపతి శ్మశాన వాటిక వద్ద ఉదయం 7గంటలకు నివాళులర్పిస్తారు. మధ్యాహ్నం 12గంటలకు ఆర్.శెట్టి భవనంలో జరగనున్న సాధారణ సభలో కలెక్టర్ లింగరాజ్ పండా, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, ముఖ్యవక్త డాక్టర్ మన్మథ పాఢి, పర్లాకిమిడి ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు, మోహానా ఎమ్మెల్యే దశరథి గమాంగో, ఎస్డీసీ ఛైర్‌పర్సన్ మరియం రైతో, పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి, ఏడీఎం సంగ్రాంశేఖర పండా తదితరులు పాల్గొనున్నారు.

విద్య, న్యాయ ప్రగతిలో..


1942లో మహారాజా కృష్ణచంద్ర గజపతి నారాయణదేవ్‌ను ఆహ్వానించిన అప్పటి బ్రిటిష్ గవర్నర్ సర్ హాతర్న్ వేల్స్.. ఒడిశా ప్రీమియర్ ప్రైం మినిస్టర్ పదవిలో కూర్చోబెట్టారు. రెండుసార్లు ఆయన ఈ పదవిలో కొనసాగారు. అదే సమయంలో బరంపురం మెడికల్ కళాశాల, 1943లో ఒడిశాలో ఉన్నత విద్యకు అత్యంత ప్రాధాన్యత కలిగిన బిల్లును మంత్రిమండలిలో ఆమోదింపజేసి, భువనేశ్వర్‌లో ఉత్కళ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు కృషి చేశారు. అలాగే 1948లో కటక్‌లో హైకోర్టు స్థాపించారు. పర్లాకిమిడిలో గజపతి కళాశాల, ఉన్నత విద్యాలయాలు నెలకొల్పారు.

నారాయణపూర్ అడవుల్లో పులిచర్మం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వివేకానంద శర్మ, వెనుక నిందితులు

- 136కిలోల గంజాయి సైతం స్వాధీనం చేసుకున్న పోలీసులు



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న పులి చర్మం

రాయగడ: జిల్లాల్లోని పద్మపూర్ పోలీస్ స్టేషన్ పరిధి నారాయణపూర్ అడవుల్లో పోలీసులు నిర్వహించిన దాడుల్లో పెద్దపులి చర్మంతో పాటు 136కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి బహుదపూర్ గ్రామానికి చెందిన నాగేశ్వర్ మాఝి, సవులా మాఝి, నవుసేన్ మల్లిక్‌ను నిందితులుగా గుర్తించి, అరెస్ట్ చేశారు. ఈ మేరకు వివరాలను జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఎస్పీ వివేకానంద శర్మ వెల్లడించారు. నారాయణపూర్ అడవుల్లో గంజాయి అక్రమ రవాణా జరుగుతుందన్న సమాచారం మేరకు ప్రత్యేక పోలీసు బృందం ఆకస్మిక దాడులు నిర్వహించింది. ముందుగా పొదల్లో దాచి ఉంచిన 64కిలోల పట్టుకున్నారు. మరికొంత దూరం గాలించగా మరో 72 కిలోల గంజాయి, 4అడుగుల పొడవైన పులి చర్మం పట్టుబడిందని వివరించారు.

పట్టుబడిన సెల్‌ఫోన్ దొంగ

రాయగడ న్యూకాలనీలోని కపిలాస్ కూడలిలో నివాసం ఉంటున్న మారుకుండు పట్నాయక్ మార్చి 29న ఏదో పనిపై జిల్లా కేంద్రాస్పత్రికి వెళ్లగా.. అతని సెల్‌ఫోన్ అపహరణకు గురైంది. ఈ మేరకు బాధితుడు సదరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు కొరాపుట్ జిల్లాలోని బంధుగాం పోలీస్‌స్టేషన్ పరిధి సొడా బడి గ్రామానికి చెందిన గురునాథ్ హలుబ(30)ను అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 19సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ శర్మ తెలిపారు. అనుమానస్పదంగా తిరుగాడుతున్న హలుబాను స్థానిక రైతుల కాలనీలో గురువారం అదుపులోకి తీసుకొని, విచారించగా అసలు విషయం బయట పడిందని పేర్కొన్నారు.

చైత్రోత్సవాలకు శ్రీకారం



కలశాలతో జంఝావతి నదీ జలాలను తీసుకువస్తున్న మందిరం కమిటీ సభ్యులు

- రాయగడలో ప్రారంభమైన మజ్జిగౌరి వార్షికోత్సవాలు



రాయగడ: ఉత్కళ ప్రజల ఆరాధ్యదైవం మజ్జిగౌరి అమ్మవారి వార్షిక చైత్రోత్సవాలు శుక్రవారం సాయంత్రం సంప్రదాయంగా ప్రారంభమయ్యాయి. ఈ మేరకు సమీపంలోని జంఝావతి నదికి చేరుకున్న పురోహితులు, మందిరం కమిటీ సభ్యులు.. గంగమ్మకు పూజలు నిర్వహించారు. అనంతరం కలశాలతో శుద్ధ జలాలను తీసుకువచ్చి, అమ్మవారి సన్నిధిలో నిలిపారు. దీంతో ఉత్సవాలకు లాంఛనంగా శ్రీకారం చుట్టినట్లుగా గుర్తిస్తారు. గంజాం జిల్లా జొరొడా ప్రాంతానికి చెందిన వేదపండితులు నీలమాధవ్ త్రిపాఠి, వాసుదేవ్ మహాపాత్రొ, జగన్నాథ దాస్, సరోజ్ త్రిపాఠి, ఇస్మాన్ రథొ, శక్తిప్రసాద్ దాస్, ప్రతాప్‌చంద్ర దాస్ తదితరులు మజ్జిగౌరి ఆలయ రాజ పురోహితులు బీరంచి దాస్ నేతృత్వంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. కలశాలతో శుద్ధ జలాలను మందిరం మేనేజింగ్ ట్రస్టీ రాయిసింగి బిడిక, సభ్యులు పెద్దిన వాసు, ఇప్పిలి సన్యాసిరాజు, ప్రకాష్ పాలకొండ, వడ్డాది శ్రీనివాస్ రావు తీసుకువచ్చారు. శనివారం ఉదయం సూర్యా వాహనతో పూజలు కొనసాగుతాయని పండితులు త్రిపాఠి తెలిపారు. ఉత్సవాలు ఏప్రిల్ 5వరకు కొనసాగుతాయి. ఇదిలా ఉండగా ఉత్సవాల సందర్భంగా అమ్మవారు సునాబేసా(బంగారు అలంకరణతో) భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

పెట్రోల్ పోసుకుని వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన శ్రీను (ఫైల్)

కొత్తవలస: అనారోగ్యం కారణంగా మనస్తాపానికి గురైన మండలంలోని దేశపాత్రుని పాలెం గ్రామానికి చెందిన నక్క శ్రీను(48) పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని శుక్రవారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ ఎస్.బాలసూర్యారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీను కొద్ది రోజులుగా మెదడుకు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం తెల్లవారుజామున బాత్‌రూమ్‌లోకి వెళ్లి అప్పటికే అక్కడ దాచుకున్న పెట్రోల్‌ను వంటి మీద పోసుకుని నిప్పు పెట్టుకున్నాడు.గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అప్రమత్తమై విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడికి ఒక పాప, బాబు ఉన్నారు.

కుట్రపూరితంగానే రాహుల్‌పై వేటు

- డాబుగాం మాజీ ఎమ్మెల్యే భుజబల్ మాఝి



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భుజబల్ మాఝి

జయపురం: దేశ చరిత్రలో పరువునష్టం కేసులో రెండేళ్ల జైలు శిక్ష విధించడం బహుశా ఇదే తొలిసారని కాంగ్రెస్ పార్టీ మీడియా ప్రతినిధి, డాబుగాం మాజీ ఎమ్మెల్యే భుజబల్ మాఝి అభిప్రాయం వ్యక్తంచేశారు. ఇది కేవలం కుట్రపూరిత చర్యని విమర్శించారు. జయపురంలోని కొరాపుట్ జిల్లా కాంగ్రెస్ భవనంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాహుల్‌గాంధీని పార్లమెంట్ నుంచి బహిష్కరించడం ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడమేనని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో అధాని, మోదీ సంబంధాలపై ప్రశ్నించడం తోనే ఈ అప్రజాస్వామ్య చర్యకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రజలను, దేశాన్ని మోసం చేసి కోట్లాది రూపాయల ధనంతో విదేశాలకు పారిపోయిన వ్యక్తులనే దొంగలుగా అభివర్ణించగా, వక్రీకరించి, తప్పుడు కేసులు బనాయించారని పేర్కొన్నారు. దేశంలో వాక్ స్వాతంత్రం, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేంత వరకు కాంగ్రెస్ పార్టీ నిరవధికంగా పోరాడుతుందని ఆయన ప్రకటించారు. అలాగే ఈనెల 2న రాష్ట్ర రాజధానిలో ఎస్టీ, ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో కొరాపుట్ జిల్లా డీసీసీ అధ్యక్షురాలు మీనాక్షీ బాహిణీపతి, ఉపాధ్యక్షుడు బినోద్ మహాపాత్రొ, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎాసన్ మదాని, కోశాధికారి నిహార్ బిశాయి, కొట్‌పాడ్ బ్లాక్ అధ్యక్షుడు అశోక్ గంతాయిత్, జయపురం సమితి అధ్యక్షుడు బసంత నాయిక్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుకాంత పట్నాయక్, పీసీసీ సభ్యులుమదన మోహన నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీతం కళాశాలలో 'హ్యాకథాన్' సదస్సు

విజయనగరం అర్బన్: గాజులరేగలోని సీతం ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు 'స్మార్ట్ విజయనగరం' అనే అంశంపై 'హ్యాకథాన్' సదస్సు నిర్వహిస్తున్నామని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ మేరకు సదస్సు షెడ్యూల్‌ను విడుదల చేశారు. కళాశాల విద్యార్థులు రూపొందించిన 'ఒన్ వెబ్ డెవలప్‌మెంట్' ప్రోగ్రామ్‌ను ఈ సదస్సులో విడుదల చేస్తామని చెప్పారు. జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (వీసీ) ప్రొఫెసర్ కె.వెంటసుబ్బయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యే ఈ సదస్సులో వివిధ యూనివర్సిటీలకు చెందిన ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. నాలుగురోజుల పాటు జరిగే ఈ సదస్సుకు ఉత్తరాంధ్ర జిల్లాల విద్యార్థులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీరామమూర్తి, కంప్యూటర్ సైన్ విభాగ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర ఆలయాలపై

ఆల్బమ్ చేస్తా

- సినీ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్



విజయనగరం టౌన్: సంగీత సరస్వతి పాదాలకు ప్రణమిల్లుతూ.. విద్యలనగరాన్ని మా చిన్నాన్న మాధవపెద్ది సత్యం ఆశీస్సులతో చాలాసార్లు సందర్శించడం అదృష్టంగా భావిస్తున్నానని సినీ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్ అన్నారు. గురునారాయణ కళాపీఠం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శనివారం అందించే పురస్కారం తీసుకునేందుకు జిల్లాకు తన సతీమణి నిర్మలతో కలిసి శుక్రవారం వచ్చారు. ఈ సందర్భంగా 'సాక్షి' ముచ్చటించారు.

విజయవాడ వద్ద తెనాలి మాది. విజయవాడలో విజయ ఉంది. నేను విజయా బ్యానర్‌పై ప్రముఖ చిత్రాలు చేశాను. విజయనగరంతో మాకు ఎనలేని అనుబంధం ఉంది. 1975 నుంచి తరచుగా కీబోర్డు ప్లేయర్‌గా జిల్లాకు వచ్చేవాడిని. ఘంటసాలకు మా చిన్నాన్నకు ఎనలేని అనుబంధం ఉండేది. గానకోకిల సుశీలమ్మతో కలిసి పనిచేశాను. ఆదిభట్ల కుటుంబం అంటే చాలా ఇష్టం. ఇక్కడి గాయనీ, గాయకులతో ఉత్తరాంధ్రాలో ఉన్న ప్రముఖ ఆలయాలపై ఆల్బమ్‌ను రూపొందించాలనేది నా కోరిక. లెక్కకు మించి వచ్చిన పురస్కారాలకంటే ఘంటసాల, సుశీల, ఎస్.రాజేశ్వరరావు తిరుగాడిన నేలపై పురస్కారం అందుకోవడం పూర్వజన్మసుకృతంగా భావిస్తున్నాను. సంగీతం క్షుణ్ణంగా తెలిసిన వ్యక్తి బి.ఎ.నారాయణ. అటువంటి వ్యక్తి కళాపీఠం స్థాపించి వార్షికోత్సవం చేసుకోవడం, తనను పురస్కారానికి ఎంపిక చేయడం ఆనందంగా ఉంది. విజయా సంస్థ బ్యానర్‌పై బృందావనం, భైరవద్వీపం, శ్రీకృష్ణార్జునీయం చిత్రాలు చేయడం అదృష్టం. సుమారు 70 చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించాను. ప్రస్తుతం తమిళంలో చిత్రాలు చేసేందుకు సిద్ధమవుతున్నాను. నేను పాతతరానికి, కొత్త తరానికి వారధిలా ఉన్నాను. పాత సంగీతం ఇప్పటికీ వింటూనే ఉన్నాం. మా తరంలో పాతతరంతో పాటూ మెలోడీ ఉంది. పౌరాణికాలు, జానపద చిత్రాలు ఉండేవి. ఇప్పుడు పౌరాణికాలు రావడం లేదు. రామాయణం చిత్రం జూనియర్ ఎన్‌టీఆర్‌తో చేశాను. వెరైటీ సినిమాలు రావాలి. నేటితరంలో సినిమా తీయాలంటే చాలా కష్టంతో కూడుకున్నదనడంలో అతిశయోక్తి లేదు. త్రివిక్రమ్ శ్రీనివాస్, రాజమౌళి, సుకుమార్ వంటి దర్శకులు మంచి సినిమాలు తీస్తున్నారు. కాలం మారుతున్న కొలది పాతమెలోడీస్ వస్తాయి. నాకు నచ్చింది కృతజ్ఞతా భావం. అది ఎక్కువగా ఎస్పీ బాలు వద్ద చూశాను. సంగీతం నేర్చుకునే వారందరూ అకుటుంఠిత దీక్షతో సాధనచేస్తే ఉన్నతస్థాయికి వెళ్తారనేది సత్యం.

నదిలో గల్లంతైన యువకుడి మృతి

- కడకెల్ల తీరంలో లభ్యమైన మృతదేహం



కార్తీక్ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు



మృతదేహం లభ్యమైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఐ సత్యనారాయణ

వీరఘట్టం: నాగావళి నదిలో గల్లంతైన పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం కొత్తూరు గ్రామానికి చెందిన యువకుడు అన్ను కార్తీక్(17) మృతదేహం మృతదేహం వీరఘట్టం మండలం కడకెల్ల సమీపంలోని నదీ తీరంలో శుక్రవారం లభ్యమైంది. గురువారం నదిలో గల్లంతైన కార్తీక్ జాడకోసం 24 గంటలుగా వెతుకున్న బంధువులకు మృతదేహమై కనిపించడంతో అంతా కన్నీటి పర్యంతమయ్యారు. అయితే నదిలో తరచూ జరుగుతున్న ఇసుక తవ్వకాల వల్ల ఎక్కడ గోతులు ఉన్నాయో తెలియపోవడంతోనే కార్తీక్ నీట మునిగి ప్రాణాలు వదిలాడని బంధువులు, గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ ద్వారపురెడ్డి ధనుంజయరావులు రోదించారు. ఇక్కడ ఇసుక తవ్వకాలు చేపట్టేవారిపై కేసు నమోదు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని పోలీసులను డిమాండ్ చేశారు. అనంతరం ఎల్విన్‌పేట సీఐ పి.సత్యనారాయణ సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీశారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి మృతుని కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. మృతుని తండ్రి వెంకట్ ఫిర్యాదుపై ఇన్‌చార్జ్ ఎస్సై కిశోర్‌వర్మ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

డివైడర్‌ను ఢీకొని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి..



పొట్నూరి రాజేష్ (ఫైల్)

భోగాపురం: విజయనగరం జిల్లా గరివిడి మండలం శేరిపేట గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పొట్నూరి రాజేష్ (23) డివైడర్‌ను ఢీకొని శుక్రవారం మృతి చెందాడు. భోగాపురం మండలంలోని రాజాపులోవ జాతీయ రహదారిపై జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. పొట్నూరి రాజేష్ కొమ్మాదిలో నివాసముంటూ విశాఖపట్నం బీచ్ రోడ్డులో ఉన్న మొలిటెక్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ (టీం మెంబర్) ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం స్నేహితుడు మూడుముళ్ల సురేష్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై విజయనగరం జిల్లా జొన్నాడ గ్రామంలో ఉన్న మరో స్నేహితుడు మొమ్ములూరి దినేష్ ఇంటికి వచ్చాడు. ముగ్గురు స్నేహితులు రోజంతా సరదాగా గడిపి రాత్రికి అక్కడే ఉండిపోయారు. శుక్రవారం వేకువజామునే రాజేష్, సురేష్‌లు ద్విచక్ర వాహనంపై విశాఖపట్నం బయల్దేరారు. రాజాపులోవ వద్దకు చేరుకునేసరికి బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో కింద పడిపోగా రాజేష్ తలకు గాయమై తీవ్ర రక్త స్రావం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సురేష్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భోగాపురం సీహెచ్‌సీకి తరలించారు. పోలీసుల ద్వారా సమాచారం అందుకున్న మృతుని తల్లిదండ్రులు ఆస్పత్రి వద్దకు చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. మృతుడి తండ్రి సూర్యనారాయణ ఫిర్యాదు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తవుడు తెలిపారు.

వేణుగోపాలుడి భూముల సర్వేపై ఆరా



ఈఓ కార్యాలయంలో తనిఖీలు నిర్వహిస్తున్న దేవదాయ శాఖాధికారులు

బొబ్బిలి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న భూముల రీసర్వేలో పట్టణంలోని పురాతన దేవాలయం వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన భూముల వివరాలను అప్పగించారా? లేదా? అన్న వివరాలపై దేవదాయశాఖ అధికారులు ఆరా తీశారు. బొబ్బిలి పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయంలోని ఈఓ కార్యాలయంలోని భూముల రికార్డులను దేవదాయ భూముల ప్రొటెక్షన్ సెల్ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ డి.భారతి, జిల్లా దేవదాయాధికారి కేఎల్ సుధారాణి, సిబ్బంది పరిశీలించారు. విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో ఉన్న వేణుగోపాలుని భూములు ఎన్ని ఉన్నాయి? అందులో ఆక్రమణల్లో ఉన్నవెన్ని, ప్రభుత్వం గుర్తించినవెన్ని, వస్తున్న ఆదాయమెంత అన్న వివరాలతో పాటు వీటిలో ఎంత మేరకు రీసర్వే జరిగిందన్న వివరాలపై సిబ్బందిని ప్రశ్నించారు. ఆలయం పేరిట దాదాపు 4వేల ఎకరాల భూములు దేవదాయ శాఖకు చెందిన రికార్డుల్లో ఉండగా ఫలసాయం మాత్రం అంతంతమాత్రమే. అజ్జాడలోనే 714 ఎకరాల భూమి ఉండగా అందులో 473.19 ఎకరాలు వేణుగోపాలుని పేరున ఉన్నట్టు గుర్తించారు. అందులో 3.50 ఎకరాల నుంచి మాత్రమే శిస్తు వస్తున్నట్టు అధికారులు చెబుతున్నారంటే ఆలయ భూములు ఎంతలా అన్యాక్రాంతమయ్యాయో తెలుస్తోంది. ఈ నేపథ్యంలో దేవదాయ శాఖాధికారులు శిస్తు ఇస్తున్న కొద్ది మంది రైతుల పేరిట రైతు భరోసా పథకం ప్రయోజనాలను కల్పించారు. మిగతా వారు ముందుకొస్తారనే ఈ ఆలోచన ఫలితాలనిస్తుందో లేదో చూడాలని దేవదాయ శాఖాధికారులు ఎదురు చూస్తున్నారు. మడ్డువలస ప్రాజెక్టు భూసేకరణలో కొట్టిశ గ్రామానికి చెందిన దేవుడి భూములకు దాదాపు రూ.కోటి పరిహారం వచ్చింది. వీటిలో లోక్ అదాలత్ ద్వారా సాగు చేస్తున్నవారికి 60 శాతం, దేవదాయ శాఖకు 40 శాతం వచ్చినట్టు ఈఓ పీవీ మాధవరావు, ఎస్‌డీసీ ప్రసాద్ తెలిపారు. వేణుగోపాలస్వామి భూములను రీసర్వేలో చేర్చేందుకు అన్ని మండలాల తహసీల్దార్లనూ కలసి రిపోర్టులు అందజేస్తున్నట్టు దేవదాయ శాఖ జిల్లా అధికారి కేఎల్ సుధారాణి తెలిపారు. తనిఖీల్లో భాగంగా ఇక్కడి రికార్డుల్లోని కొన్ని కాపీలను వారు వెంట తీసుకువెళ్లారు. కార్యక్రమంలో ఈఓలు పీవీ మాధవరావు, ప్రసాద్, డీటీ కృష్ణ కుమారి, సర్వేయర్లు ఎస్.రూపవతి, పీఎస్‌ఆర్ ఆచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సూర్యనారాయణస్వామి హుండీ ఆదాయం రూ.93,916



హుండీలో డబ్బులు లెక్కిస్తున్న అధికారులు

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్‌లో ఉంచిన అరసవల్లి సూర్యనారాయణ స్వామి హుండీ ఆదాయాన్ని ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ఆధ్వర్యంలో శుక్రవారం లెక్కించారు. ఈ లెక్కింపులో నోట్లు రూపేణా రూ. 19,635, చిల్లర రూపేణా రూ. 74,281 లు మొత్తం కలిపి రూ. 93,916 ఆదాయం వచ్చినటు ఈఓ తెలిపారు. లెక్కింపును జిల్లా దేవదాయ ధర్మాదాయ శాఖ సూపరింటెండెంట్ బీవీవీఆర్ ప్రసాద్ పట్నాయక్, ఆలయ అర్చకులు ఇప్పిలి సందీప్ శర్మ, రైల్వే ఆర్ఎం ఎం.రవి పర్యవేక్షించారు.

రేపు సొండి కుల సంఘం రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం

టెక్కలి: టెక్కలిలో గల సొండి కుల సంక్షేమ సంఘం భవనంలో ఆదివారం రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం నిర్వహిస్తున్నట్లు సంఘం కార్యదర్శి జి.నాగభూషణరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్న ఈ సమావేశానికి సంఘం ప్రతినిధులంతా హాజరు కావాలని ఆయన కోరారు.

ఆర్టీసీలో కారుణ్య నియామకాలు

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో కారుణ్య నియామకాలు చేపడుతున్నట్లు ఆర్టీసీ డీపీటీఓ ఎ.విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జనవరి 1, 2020 కు ముందు నెక్ రీజియన్ పరిధిలోని డిపోల్లో పనిచేస్తూ చనిపోయిన ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి శ్రీకాకుళం, విజయనగరం కలెక్టర్‌లు మొదటి విడత కారుణ్య నియామకాల్లో అర్హులైన కొందరికి ఉద్యోగాలు ఇచ్చినట్లు తెలిపారు. మిగిలిన వారి దరఖాస్తులను కలెక్టర్ కార్యాలయం నుంచి ఏపీఎస్ ఆర్టీసీ కార్యాలయానికి తిరిగి పంపించారన్నారు. అందులో భాగంగానే ఇపుడు ఏపీఎస్ ఆర్టీసీలో జూనియర్ అసిస్టెంట్, కండక్టర్, శ్రామిక్ పోస్టులను వారి అర్హతలను బట్టి భర్తీ చేసేందుకు సన్నాహాలు చేయడం జరిగిందన్నారు. అర్హులైన అభ్యర్థులు అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలు సిద్ధం చేసుకోవాలని ఆయన కోరారు.

కేన్సర్ బాధితుడికి చిన్నారుల సాయం



కేన్సర్ బాధిత చిన్నారి కుటుంబానికి సాయం అందిస్తున్న శ్రీ విజ్ఞాన్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

కంచిలి: మండలంలోని పెద్దశ్రీరాంపురం గ్రామానికి చెందిన కేన్సర్ బాధితుడు లండ యోగేంద్రకు కంచిలికి చెందిన శ్రీ విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్ చిన్నారులు సాయం చేశారు. యోగేంద్ర పరిస్థితిపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనం వారిని కదిలించింది. వారి పాకెట్ మనీ నుంచి బాధితుడికి రూ.20వేలు అందించారు. ఈ మొత్తాన్ని బాధిత బాలుడి కుటుంబ సభ్యులకు పాఠశాల ఆవరణలో శుక్రవారం అందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతోపాటు పాఠశాల కరస్పాండెంట్ సీహెచ్ ఆదినారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తమ్మ తల్లి ఆలయ ఈఓగా రాధాకృష్ణ



బాధ్యతలు స్వీకరిస్తున్న రాధాకృష్ణ

కోటబొమ్మాళి: కొత్తమ్మ తల్లి ఆలయ కార్యనిర్వహణాధికారిగా వాకచర్ల రాధాకృష్ణ నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం శ్రీకాకుళంలోని ఉమారుద్ర కోటేశ్వరాలయానికి గ్రేడ్-3 ఈఓగా పనిచేస్తున్నారు. గ్రేడ్-2 ఈఓగా పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఈఓగా పనిచేస్తూనే ఉమారుద్ర కోటేశ్వరాలయంతో పాటు పాలకొండ కోటదుర్గమ్మ ఆలయాలకు ఇన్‌చార్జి ఈఓగానూ వ్యవహరిస్తారు.

కుట్రపూరితంగానే రాహుల్ గాంధీపై కేసులు



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి

శ్రీకాకుళం అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రపూరితంగానే రాహుల్‌గాంధీపై కేసులు బనాయించిందని డీసీసీ అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి అన్నారు. శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞానభవన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆదాని ఆస్తులు రాత్రికి రాత్రే ఎలా రెట్టింపయ్యాయని రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో నిలదీసినందుకే అక్రమ కేసులని పెట్టారని ఆరోపించారు. భారత్ జోడో పాదయాత్రకు వచ్చిన ప్రజాదరణ చూసి ఓర్వలేని మోదీకి భయం పట్టుకుందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డి.గోవిందమల్లిబాబు, కృష్ణ, పైడి నాగభూషణరావు, షణ్ముఖరావు, రెల్ల సురేష్, రాజేశ్వరరావు, ఎ.దాలినా యుడు, సాయిరాం, జి.అప్పారావు పాల్గొన్నారు.

విపత్తులో రక్షణ.. కమెండో శిక్షణ

- జిల్లా పోలీసు శాఖకే స్వాట్ శిక్షణ గర్వకారణం
- విశాఖపట్నం రేంజి డీఐజీ ఎస్.హరికృష్ణ
- అబ్బురపరిచేలా స్వాట్ ప్రదర్శన

ఎంతటి కఠిన సవాళ్లనైనా ఎదుర్కోవడం.. శత్రు మూకల్లోకి చొచ్చుకుపోయి.. వారి వ్యూహాలను చిన్నాభిన్నం చేయడం కమెండోలు ప్రత్యేకత. జిల్లా పోలీసుదళంలో కూడా అటువంటి కఠోర శిక్షణ పొందిన కమెండోలు ఉంటే బాగుంటుందని భావించిన ఎస్పీ రాధిక స్పెషల్ టాస్క్ ఫోర్స్ నుంచి మెరికల్లాంటి వారిని ఎంపిక చేసి ఆక్టోపస్ కమెండోలతో స్పెషల్ వెపన్స్ అండ్ టాక్టిక్స్ (స్వాట్)లో శిక్షణ ఇప్పించారు. విశాఖ రేంజ్‌లో తొలిసారి శ్రీకాకుళం జిల్లాలోనే ఈ శిక్షణ ఇవ్వడం ముదావహమని డీఐజీ హరికృష్ణ ప్రశంసించారు.



ఆక్టోపస్ కమాండోల శిక్షణలో స్వాట్ సిబ్బంది విన్యాసాలు (ఇన్‌సెట్లో) ప్రశంసపత్రాన్ని అందజేస్తున్న డీఐజీ హరికృష్ణ, ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకు చెందిన స్పెషల్ టాస్క్ ఫోర్స్ నుంచి పోలీసు సిబ్బంది స్వాట్ (స్పెషల్ వెపన్స్ అండ్ టాక్టిక్స్) శిక్షణ పొందడం జిల్లా పోలీసు శాఖకే గర్వకారణం అని విశాఖపట్నం రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ కొనియాడారు. జిల్లాలోని విపత్కర పరిస్థితుల్లో ఈ శిక్షణ పొందిన పోలీసుల సేవలు అవసరమని భావించిన ఎస్పీ జీఆర్ రాధిక వీరి శిక్షణ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లారు. దీంతో ఆక్టోపస్ కమాండోలతో జిల్లా పోలీసు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ ముగింపు కార్యక్రమం శుక్రవారం సాయంత్రం స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఐజీ హాజరయ్యారు. రెండు నెలలుగా 32 మంది స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి తండేవలస జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో ఆక్టోపస్ కమాండోలతో కఠోర శిక్షణ తరగతులు నిర్వహించారు. సుశిక్షితులైన స్వాట్ కమాండోలు విపత్కర పరిస్థితుల్లో ఉగ్రమూకలపై ఏ విధంగా ప్రతిదాడి చేస్తారో ఇక్కడ ప్రదర్శన ఇచ్చారు. స్థానికులు వీటిని చూసి అబ్బురపడ్డారు.





ఆపద ఎదురైతే..



ముష్కర మూకల పని పడుతూ..



ఆపత్కాలంలో జరిపే ఆపరేషన్లను వివరిస్తూ..



సిక్కోలు ధిక్కార పతాక

ఆ భూమిపై పడిన నెత్తుటి చుక్కలు.. ఆ తర్వాతి రైతాంగ ఉద్యమాలకు చుక్కానిగా మారాయి. ఆ యుద్ధంలో ఎగసిపడిన ఆగ్రహావేశాలు.. నేటి పోరాటాలకు నినాదాలై జీవం పోసుకున్నాయి. తూటాలకు ఎదురెళ్లిన సామాన్యుల సాహసం.. శ్రీకాకుళ సాయుధ విప్లవానికి బీజం వేసింది. ఆ ఒక్క తిరుగుబాటు గున్నమ్మను వీర గున్నమ్మగా మార్చింది, గుడారి రాజమణిపురం అనే పేరును చెరిపేసి వీరగున్నమ్మపురం అనే పేరును చరిత్ర పుటలకిచ్చింది, జమీందార్ వెన్ను కూడా వణుకుతుందని నిరూపించింది, నిలబడి కలబడితే తుపాకులు పట్టుకున్న వారైనా నేలకూలుతారని చెప్పింది. ఒక నిండు గర్భిణి సారథ్యంలో జరిగిన ఈ పోరాటాన్ని గుర్తు చేసుకుని ముందు తరాలకు అందించడం అన్ని తరాల వారి కర్తవ్యం.



సాసుమాన గున్నమ్మ ఊహా శిల్పం

- జమీందారులకు వ్యతిరేకంగా పోరాడిన వీర గున్నమ్మ
- రైతాంగ ఉద్యమాలకు ఆమె పోరాటమే స్ఫూర్తి
- నేడు వీర గున్నమ్మ వర్ధంతి



వీజీపురం గున్నమ్మ స్వాగతద్వారం

మందస: సాసుమాన గున్నమ్మ.. ఈ పేరు చాలా మందికి కొత్త కావచ్చు. వీర గున్నమ్మ అని చెబితే తెలియని వారుండరు. వీరనారిగా పేరుపొందిన సాసుమాన వీరగున్నమ్మ స్వగ్రామం మందస మండలం గుడారి రాజమణిపురం. జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన ఆమె మృతి చెంది నేటికి 83 ఏళ్లు పూర్తయ్యాయి. చాలాసామాన్య కుటుంబంలో పుట్టి పెరిగిన గున్నమ్మ ఇప్పుడు ఇంత మందికి స్ఫూర్తిగా నిలవడం వెనుక చాలా కథ నడిచింది. ఆ కథ ఎప్పటికప్పుడు ఉద్యమకారుల గుండెల్లో నిప్పు ఆరిపోకుండా కాపాడుతోంది. 1940 మార్చి 27 నుంచి ఏప్రిల్ 1 తేదీ వరకు జరిగిన సంఘటనల సమాహారమే సాసుమాన గున్నమ్మ వీరగున్నమ్మగా మారిన నేపథ్యం.

సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన గున్నమ్మ గర్భిణిగా ఉన్నప్పుడే ఆమె భర్త మాధవయ్య మృతి చెందారు. అప్పట్లో స్వాతంత్య్ర పోరాటంతో పాటు రైతు హక్కుల పోరాటాలు కూడా జరిగేవి. అలా 1940 మార్చి 27, 28 తేదీల్లో పలాసలో పెద్ద ఎత్తున అఖిల భారత రైతు మహా సభలు జరిగాయి. ఆ సభల స్ఫూర్తితో 1940 మార్చి 29న మార్పు పద్మనాభం నాయకత్వాన గుడారి రాజమణిపురంలో మందస సంస్థానం కిసాన్ మహాసభ నిర్వహించారు. ఈ సభలో గున్నమ్మ కూడా మాట్లాడారు. జమీందారులకు వ్యతిరేకంగా నినాదమిచ్చి.. మందస కొండల్లోని రుక్కిమెట్ట అడవులోకి వెళ్లి కలప తీసుకువద్దామని పిలుపునిచ్చారు. రైతులు కలపను నరికి ఎద్దుల బళ్లపై తీసుకు వస్తున్నారన్న సమాచారం మందస జమీందార్ శ్రీరాజా జగన్నాథరాజమణిదేవ్‌కు తెలిసి రైతులను అణచివేయడానికి సిద్ధమయ్యారు. ఇందుకు తెల్లవారి సాయం కూడా తీసుకున్నారు. అయితే అందరి ఆంక్షలను ధిక్కరిస్తూ గున్నమ్మ కలపను ఊరికి తీసుకువచ్చారు. దీంతో మార్చి 30వ తేది రాత్రి గుడారి రాజమణిపురంలో అభినందన సభ జరిగింది. గున్నమ్మ ధైర్య సాహసాలను కిసాన్ నాయకులు ప్రశంసించారు. అయితే దీన్ని అప్పటి పోలీస్ ఇన్‌స్పెక్టర్ గోపిసుందర గంతాయత్ సహించలేకపోయారు. అప్పటి సోంపేట మెజిస్ట్రేట్ మద్దతుతో 10మంది కానిస్టేబుళ్లను వెంటబెట్టుకుని ఏప్రిల్ 1వ తేదీన గుడారి రాజమణిపురం వచ్చారు. గ్రామానికి ఉత్తరాన ఉన్న పొలంలో గుమిగూడి ఉన్న ప్రజల వద్దకు వెళ్లి కలప స్వాధీన పరచాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఎస్‌ఐ హెచ్చరించారు. రైతులు తీవ్రంగా ప్రతిఘటించడంతో అక్కడి నుంచి వెనుదిరిగారు.

ప్రత్యక్ష పోరాటంలో..

విషయం తెలుసుకున్న జమీందారు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కొంత సేపటి తరువాత మరో పోలీసు వాహనం వచ్చి పొలం పక్కన రోడ్డుపై ఆగింది. ఒకవైపు తుపాకులతో పోలీసులు, సైనికులు మరోవైపు బల్లేలు, ఈటెలతో రైతులు ముఖాముఖి పోరుకు సిద్ధమయ్యారు. కడుపులో ఒక బిడ్డను మోస్తున్న గున్నమ్మ కూడా కదన రంగంలో కాలు కదిపారు. ముందుగా అదే గ్రామానికి చెందిన గూడేన నర్సింహులు, కొర్ల దాలిబందు, గొర్లె సంగాలు, గొర్లె చంద్రయ్య, నెయ్యిల మంగళ, గొర్లె కర్రెన్నలను పోలీసులు వాహనంలోకి ఎక్కించారు. అయితే ఆ వాహనాన్ని ముందుకు కదలనీయకుండ గుంట భైరాగి అడ్డంగా పడుకున్నాడు. ఈ దృశ్యాన్ని చూసిన వీరగున్నమ్మ కూడా అధికారుల వాహనాలకు అడ్డంగా నిలబడింది. గున్నమ్మ గుండెకు పోలీసులు తుపాకులను గురిపెట్టారు. తప్పుకోమని హెచ్చరించారు. పోలీసు అధికారి మునిలాల్ తుపాకీని పైకి ఎత్తాడు. అయినప్పటికీ గున్నమ్మ చలించలేదు. దీంతో ఘర్షణ తప్పలేదు. కేకలు, అరుపులు, తుపాకీ గుళ్ల శబ్దాలతో మార్మోగిపోయింది. గున్నమ్మ పొట్ట నుంచి తుపాకీ గుళ్లు దూసుకుపోయాయి. 1940 ఏప్రిల్ 1వ తేదీ సాయింత్రం సూర్యాస్తమయం సమయంలో గున్నమ్మ ఆ పొలంలోనే ఒరిగిపోయింది. గున్నమ్మతో పాటు గుంట బుదియాడు, కర్రి కలియాడు, గుంట చిన్ననారాయణ, గొర్లె జగ్గయ్యలు పోలీసు కాల్పుల్లో వీరమరణం పొందారు. ఆ మృతి తర్వాత శ్రీకాకుళ సాయుధ రైతాంగ పోరాటానికి పురుడు పోసింది. 1988 సెప్టెంబర్ పదో తేదిన వీరగున్నమ్మ పేరుతో ప్రభుత్వం స్థూపం నిర్మించింది. గ్రామస్తులు గున్నమ్మ పేరుతో గ్రామంలో కళామందిరం నిర్మించుకున్నారు. దర్శకుడు గూన అప్పారావు విప్లవసేనాని వీరగున్నమ్మ అనే చిత్రాన్ని తీశారు. గున్నమ్మ వర్ధంతి సభ ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు సర్పంచ్ కర్రి గోపాలకృష్ణ చెప్పారు.



అప్పటి గవర్నర్ కుముద్‌బెన్‌జోషి ఆవిష్కరించిన వీరగున్నమ్మ స్థూపం

'కోవిడ్'పై అప్రమత్తంగానే ఉన్నాం

- ఇంతవరకు జీరో కేసులు
- జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ మీనాక్షి

అరసవల్లి: కోవిడ్ మహమ్మారిపై జిల్లా వైద్యారోగ్య శాఖ యంత్రాంగం అప్రమత్తంగానే ఉందని, గత అనుభవాల దృష్ట్యా ముందస్తు జాగ్రత్తలు, చర్యలపై దృష్టి సారించామని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి తెలిపారు. ఆమె శుక్రవారం 'సాక్షి'తో మాట్లాడుతూ రాష్ట్రంలో కరోనా కేసులు అక్కడక్కడా నమోదవుతున్నాయని, అయితే ఇంతవరకు మన జిల్లాలో కేసులు నమోదు కాలేదని స్పష్టం చేశారు. అయితే జిల్లా జనరల్ ఆస్పత్రిలో శాంపిల్ యూనిట్ సేకరణ ప్రక్రియ కొనసాగిస్తున్నామని, అలాగే అన్ని గ్రామ సచివాలయాల పరిధిలోని వైఎస్సార్ విలేజీ హెల్త్ క్లినిక్స్‌లో ర్యాపిడ్ టెస్టింగ్ కిట్స్‌ను అందుబాటులో ఉంచామని వివరించారు. ఎవరికైనా అనుమానాలుంటే పరీక్షలు చేయించుకోవచ్చునని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా సుమారుగా 80 శాతం వరకు ఫీవర్ సర్వే పూర్తి చేశామని, ఇంకా గ్రామాల్లో ఈ ప్రక్రియను కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో వైరల్ జ్వరాలతో ఇబ్బందులు పడుతున్న వారు ఉన్నారని, అలాగే ఒళ్లు నొప్పులు, తలనొప్పి, దగ్గు, జ్వర లక్షణాలున్నవారు హెచ్3 ఎన్2 వైరస్, మలేరియా, డెంగీ, కోవిడ్ పరీక్షలను చేయించుకుంటే మంచిదని, ఇవన్నీ మన ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగానే చేయించుకోవచ్చునని ఆమె వివరించారు.

జిల్లాలో ఇప్పటివరకు కోవిడ్ కేసులు అధికారికంగా నమోదు కాకపోయినప్పటికీ, ఇతర రాష్ట్రాలు, జిల్లాలకు వెళ్లేవారు మాత్రం పరీక్షలు చేయించుకోవడం మంచిదని తెలిపారు.

'విద్యుత్ వృథా అరికడితే ఆదా చేసినట్టే'




అవగాహన కల్పిస్తున్న ఎనర్జీ ఆడిటర్ మూర్తి

అరసవల్లి: రైతులు సమర్థవంతంగా విద్యుత్ వినియోగించుకోవాలని, అందుబాటులో ఉన్న సాంకేతికతను వాడుకోవాలని ఎనర్జీ ఆడిటర్ (ఆడిటెక్) టీఎస్ఎస్ మూర్తి సూచించారు. ఆయన శుక్రవారం విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో సమర్థవంత విద్యుత్ వినియోగంపై రైతులకు, పంపుసెట్ల టెక్నీషియన్లకు శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ముందుగా సర్కిల్ కార్యాలయంలో టెక్నీషియన్లకు, అంబేడ్కర్ ఆడిటోరియంలో పంపుసెట్ల రైతులకు అవగాహన కల్పించారు. విద్యుత్ ఎలా ఆదా చేయాలి, వృథా ఎలా అరికట్టాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. పాడైన పంపుసెట్లను అలా వదిలేయకుండా ప్రభుత్వానికి తిరిగి ఇచ్చేస్తే కొత్త పంపుసెట్లను పొందేలా పథకాలున్నాయని గుర్తుచేశారు. బోర్ వెల్ వాటర్ కండీషనర్లు, మాగ్నెటిక్ యాక్టివైజర్ల వంటి పరికరాల గురించి వివరించారు. రైతులు, టెక్నీషియన్లు సమన్వయంతో నాణ్యమైన విద్యుత్ పరికరాలు, మోటార్లను కొనుగోలు చేసుకోవాలని సూచించారు. సోలార్ వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వాలని, సోలార్ పంపుసెట్లకు కేంద్ర ప్రభుత్వం తాజాగా 65 శాతం సబ్సిడీ ఇచ్చేలా ప్రధాని మోదీ ఇటీవలే ప్రకటించారని గుర్తుచేశారు. రాష్ట్రంలో శ్రీకాకుళం జిల్లాలోనే స్మార్ట్ మీటర్లను అమర్చారని, ఇది ఎంతో లాభదాయకమన్నారు. ఈ మీటర్లతో విద్యుత్ ఆదా పొందవచ్చునన్నారు. అవగాహన కార్యక్రమంలో పంపుసెట్ల టెక్నీ షియన్లతో పాటు రైతులు, విద్యుత్‌శాఖ ఎస్ఈ ఎల్.దైవప్రసాద్, ఈఈలు ఎల్‌సిహెచ్ పాత్రుడు, బయ్యన్నాయుడు, గోపాలకృష్ణ, ఎఈ జె.సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆయువు తీసిన అక్రమ క్వారీ

- టీడీపీ నేత అక్రమ గ్రావెల్ క్వారీలో ప్రమాదం
- పనికి వెళ్లిన డిగ్రీ విద్యార్థి మృతి



మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

పొందూరు: టీడీపీ నేతకు చెందిన అక్రమ క్వారీ ఓ విద్యార్థి మృతికి కారణమైంది. ఆ కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చింది. ఈ విషాద ఘటన పొందూరు మండలం వీఆర్‌గూడెంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతకవిటి మండలం జీఎస్ పురం గ్రామానికి చెందిన బగాది మణికంఠ(20) శ్రీకాకుళంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో బీఎస్సీ (ఎంపీసీ) ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి లేకపోవడంతో తల్లి వెంకటలక్ష్మి కూలి పని చేస్తూ కుమారుడుతో పాటు కుమార్తె శారదను చదివిస్తోంది. సెలవులు రావడంతో నాలుగు రోజుల క్రితం మణికంఠ పొందూరు మండలంలోని వావిపల్లిపేటలో ఉంటున్న తాతయ్య సింహాచలం ఇంటికి వచ్చాడు. చేతి ఖర్చుల కోసం ఎవరిపైనా ఆధారపడకుండా అప్పుడప్పుడు గ్రావెల్ క్వారీ తవ్వకాల్లో పనికి వెళ్తుండేవాడు. వావిలపల్లిపేట సమీపంలోని వీఆర్‌గూడెంలో టీడీపీ నాయకుడు సువ్వారి మధుసూదనరావు అక్రమ గ్రావెల్ క్వారీ నిర్వహిస్తున్నాడు. అందులో గ్రావెల్ తీసుకెళ్లే వాహనాల నమోదు చేసే పని కోసం మణికంఠ గురువారం రాత్రి అక్కడికి వెళ్లాడు. పనిలో ఉన్న మణికంఠ పైనుంచి క్వారీ లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన గురువారం అర్ధరాత్రి జరగ్గా, క్వారీ నిర్వాహకులు మాత్రం శుక్రవారం తెల్లవారు జామున 5.30 గంటలకు కుటుంబ సభ్యులకు తెలియజేశారు.

గుట్టురట్టు కాకుండా...

అక్రమ క్వారీలో జరిగిన ప్రమాదంలో యువకుడు చనిపోవడంతో మైనింగ్, పోలీసు డిపార్ట్‌మెంట్ల నుంచి కఠిన చర్యలు తప్పవని భావించిన నిర్వాహకులు గుట్టురట్టు కాకుండా ప్రయత్నాలు చేశారు. ఘటనా స్థలాన్ని మార్చేందుకు వ్యూహరచన చేశారు. క్వారీలో కాకుండా వేరే చోట ప్రమాదం జరిగినట్లు చిత్రీకరించేందుకు ఏర్పాట్లు చేశారు. మృతదేహాన్ని కిలోమీటరు దూరం తీసుకువచ్చి జేవీఆర్ క్రషర్‌కు 100 మీటర్ల దూరంలోకి లారీని తీసుకువచ్చి మృతదేహాన్ని లారీ కింద పెట్టేశారు.

కుటుంబీకుల ధర్నా..

యువకుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. యువకుడు క్వారీలోనే చనిపోయాడని, కావాలనే అక్కడి నుంచి మృతదేహాన్ని తీసుకువచ్చి పడేశారని మండిపడ్డారు. అక్రమ క్వారీల నిర్వహణతో ఎంతోమంది ప్రాణాలను పొట్టన పెట్టుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ క్వారీలను, మైనింగ్‌లను వెంటనే మూసివేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ గారపేట-రెడ్డిపేట రహదారిలో ధర్నా చేపట్టారు. పొందూరు-చిలకపాలెం ప్రధాన రహదారి కావడంతో సుమారు రెండు కిలోమీటర్ల మీరకు వాహనాలు నిలిచిపోయాయి. కలెక్టర్, ఎస్పీ వచ్చి తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు.

నిర్వాహకులపై కేసు నమోదు..

మృతుడు మణికంఠ తల్లి బగాది వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అక్రమ క్వారీ నిర్వాహకుడు సువ్వారి మధుసూదనరావు, లారీ డ్రైవర్ నాగరాజు, మరికొంత మంది వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. గురువారం రాత్రి డ్రైవర్ నాగరాజు లారీని అజాగ్రత్తగా నడిపి మణికంఠ తలపైకి ఎక్కించడంతో ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు. అక్రమ మైనింగ్ స్థలం అధికారులకు తెలిసిపోతుందనే భయంతో ఘటనా స్థలాన్ని మార్చేందుకు నిర్వాహకులు ప్రయత్నించారని తెలిపారు. సంఘటన స్థలాన్నే తారుమారు చేశారని చెప్పారు.

క్రైమ్‌కార్నర్

వ్యాన్ ఢీకొని రిటైర్డ్ ఉద్యోగి దుర్మరణం



వారణాసి జనార్దనరావు(ఫైల్)

టెక్కలి రూరల్: మండలంలోని వలేసాగరం జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒడిశా రాష్ట్రం బరంపురం ప్రేమ్‌నగర్ హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన వారణాసి జనార్దనరావు(70) అనే రిటైర్డ్ అధ్యాపకుడు మృతిచెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...జనార్దనరావు తన భార్య ఉషారాణితో కలిసి శుక్రవారం ఉదయం బరంపురం నుంచి పలాస ట్రైన్‌లో వచ్చారు. అక్కడి నుంచి తన బంధువులతో కలిసి కారులో విశాఖపట్నం వైపు వెళ్తుండగా టెక్కలి సమీపంలోని వలేసాగరంఫ్లై ఓవర్‌పై వ్యక్తిగత పని నిమిత్తం కారు దిగారు. తిరిగి కారు ఎక్కుతుండగా పలాస నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న ఐషర్ వ్యాన్ అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన జనార్దనరావును టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో 108లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలిస్తుండగా కోటబొమ్మాళి సమీపంలో మృతిచెందారు. మృతదేహాన్ని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చి శవపంచనామానిర్వహించారు. ఈ ఘటనపై టెక్కలి ఎస్ఐ-2 రమేష్‌బాబు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు..

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని యువకుడి మృతి



వనుము పాపారావు (ఫైల్)

రణస్థలం: మండలంలోని లంకపేట గ్రామానికి చెందిన వనుము పాపారావు(27) ద్విచక్ర వాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. జె.ఆర్.పురం పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పాపారావు బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. గురువారం రాత్రి 9 గంటల సమయంలో ద్విచక్ర వాహనంతో రణస్థలం నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. అదే గ్రామానికి చెందిన బి.బాలకృష్ణ అనే వ్యక్తి బైకు ఎక్కి వెనుక కూర్చున్నాడు. లంకపేట సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో పాపారావు అక్కడికక్కడే చనిపోయాడు. వెనుక కూర్చున్న బాలకృష్ణకు తీవ్ర గాయాలు కావడంతో 108లో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పాపారావుకు తల్లిదండ్రులు సూర్యనారాయణ, లక్ష్మి, తమ్ముడు రమణ ఉన్నారు. బాలకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

మెళియాపుట్టి: మండల కేంద్రం మెళియాపుట్టిలో ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మారడికోట పంచాయతీ చీడిపాలెం గ్రామానికి చెందిన సవరకేశమ్మ(29)కు పదేళ్ల కిందట అదే గ్రామానికి చెందిన మేనమామ భాస్కరరావుతో వివాహమైంది. వీరికి కుమార్తె అస్మిత, కుమారుడు చక్రవర్దన్ ఉన్నారు. కుటుంబ కలహాలతో కేశమ్మ భర్తకు దూరంగా ఉంటూనే గ్రామంలో వలంటీర్‌గా విధులు నిర్వహిస్తోంది. కుమార్తెతో కలిసి మెళియాపుట్టి పొందర వీధిలోని అద్దె ఇంటిలో నివాసముంటోంది. శుక్రవారం మధ్యాహ్నం ఏం జరిగిందో గానీ ఇంటి వద్ద బొద్దింకల మందు తాగింది. అనంతరం తల్లికి ఫోన్ చేసి విషయం చెప్పింది. వెంటనే తల్లి వచ్చి కేశమ్మను మెళియాపుట్టి పీహెచ్‌సీకి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందింది. కాపురానికి వెళ్లమని కుటుంబ సభ్యులు చెబుతున్నా వినకుండా మొండిగా వ్యవహరించానని, అందుకే జీవితం ఇలా అయిపోయిందని ఎప్పటికప్పుడు బాధపడుతూ చెబుతూ ఉండేదని, అదే తలచుకుంటూ మనస్తాపానికి గురై ఇలా చేసిందని తల్లి చెబుతోంది. పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పాతపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.